RNI: TELTEL12215
https://youtube.com/@UstudioTV
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు


నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




RANGAREDDY, EDITION : 01, VOLUME :159 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 23 OCTOBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 159 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : సోమవారం 23 అక్టోబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

# రసవత్తరం రాజకీయం



- మల్కాజిగిరిలో వాడీవేడిగా పోరు
- కాంగ్రెస్ నుంచి మైనంపల్లి, బీఆర్ఎస్‌లోకి నందికంటి
- ఇదే అదునుగా టికెట్ దక్కించుకున్న మర్రి
- రెండు పార్టీల్లోనూ జోరందుకున్న ఫిరాయింపులు
- గెలుపునకు సై అంటే సై అంటున్న అభ్యర్థులు
- ఆత్మీయ సమావేశాలు.. కాలనీ సంఘాలతో భేటీలు
- అభివృద్ధి, వ్యక్తిగత చరిష్మాతో ప్రజల్లోకి మైనంపల్లి

**మల్కాజిగిరి- ప్రభాత సూర్యుడు:** రాష్ట్రంలో అందరి దృష్టి మల్కాజిగిరి వైపే.. ఈ నియోజకవర్గం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా పేరొందింది. బీఆర్ఎస్.. కాంగ్రెస్ సై అంటే సై అంటున్నాయి. అధికార పార్టీలో ఉండి మొదటి లిస్టులోనే టికెట్ ఖరారు చేసుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తన కుమారుడికి మెదక్ టికెట్ ఇవ్వకపోవడంతో పార్టీ అధిష్ఠానంపై తిరుగుబావుటా ఎగురేశారు. తనకు కేటాయిం చిన టికెట్‌ను త్యజించి కాంగ్రెస్ కండువా కప్పు కున్నారు. కాంగ్రెసలో తనతోపాటు తన కుమారునికి మెదక్ నుంచి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసుకుని అధికార పార్టీకి సవాల్ విసిరారు. దీంతో ఏళ్లుగా కాంగ్రెసలో ఉంటూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా కార్యకర్తలను కాపాడుతూ వస్తున్న వెనుకబడిన వర్గానికి చెందిన డీసీసీ మాజీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. కాంగ్రెసకు రాజీనామా చేసి తన అనుచరగణంతో అధికార పార్టీలో చే రడమే కాకుండా ఎంబీసీ చైర్మన్ పోస్టు దక్కించుకున్నారు. అదే సమయంలో మైనంపల్లిని ఢీకొట్టే అంగ, అర్థబలం ఉన్న మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డిని బరిలో దిం పింది బీఆర్ఎస్ అధిష్ఠానం. అనంతరం మంత్రి మల్లారెడ్డి తన అల్లుడుని వెంటబెట్టుకుని పెద్ద ఎత్తున బలప్రదర్శన నిర్వహించి మైనంపల్లికి సవాల్ విసిరారు. దీంతో ప్రస్తుతం ఇద్దరు దిగ్గజాలు ఢీ అంటే ఢీ అంటూ నియోజకవర్గంలో

మిగతా 2లో

### తెలంగాణలో

## అధికారం తేల్చేసింది

**ఇండియా టుడే- సీ ఓటర్ సర్వే!**




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీ పిస్తున్నాయ్.. ఈసారి ఎలాగైనా సరే హ్యాట్రిక్ కొట్టాలని బీఆర్ఎస్.. ఎట్టి పరిస్థితుల్లో సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని కానివ్వ కూడదని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలో పలు ప్రముఖ సంస్థలు రిలీజ్ చేస్తున్న ఎన్నికల సర్వేలతో పార్టీ అధినేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయ్. ఇప్పటి వరకూ రిలీజ్ అయిన దాదాపు అన్ని సర్వేలు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారమని తేల్చేశాయి. తాజాగా మరో ప్ర ముఖ సంస్థ.. ఇండియా టుడే-సీఓటర్ తమ సర్వేను రిలీజ్ చేసింది. ఈ సర్వేలో కూడా కాంగ్రెస్‌దే హవా అని

మిగతా 2లో

## త్యాగాలతోనే విజయాలు సాధ్యం

**పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో డీజీపీ**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

త్యాగాలతోనే విజయాలను సాధించగలమనీ, ఈ విషయాన్ని అనేక మంది పోలీసు అమరవీరులు తమ త్యాగాలతో నిరూపించారని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ఉద్ఘాటించారు. శనివారం గోషామ హల్ పోలీసు స్టేడియంలో పోలీసు అమరవీరుల సంస్మరణ, ఫ్లాగ్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం లభించాక అంతర్గత భద్రతలు సుభిక్షంగా ఉంచడానికి వందలాది మంది పోలీసులు విధి నిర్వహణలో తమ ప్రాణాలను


మిగతా 2లో




## ఇండియాకు పొంచివున్న తుఫాన్ల ముప్పు

న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

భారత్ కు ఒకే సారి రెండు తుపాన్ల నుంచి ముప్పు పొంచి ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. అరేబియా మహా సముద్రంలో తేజ్ తుపాను, బంగాళాఖాతం లో హామూన్ తుపాను రెండూ ఇండియా భూభాగంపైకి దూసుకువస్తున్నాయని స్పష్టం చేశారు. తేజ్ తుపాన్ ఆదివారం తీవ్ర తుఫానుగా మారి యెమెన్-ఒమన్ తీరాల వైపు పయనిస్తున్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ తుపాన్ వాయువ్య దిశగా కదిలి, అల్ గైదా (యెమెన్), సలాలా (ఒమెన్) మధ్య తీరం దాటుతుందని అంచనా వేశారు.



### కాంగ్రెస్‌కు

## 40 స్థానాల్లో అభ్యర్థుల్లేరు

**- మీడియాతో ఇష్టాగోష్టిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు


తమ పార్టీ తొలి జాబితా ప్రకటించి అరవై రోజులైందనీ, కానీ ప్రతిపక్ష పార్టీలకు ఇప్పటికీ అభ్యర్థుల విషయంలో స్పష్టత లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ వ్యాఖ్యా నించారు. కాంగ్రెస్‌కు 40 స్థానాల్లో అభ్యర్థులే లేరని ఆయన చెప్పారు. ఆ పార్టీ చరిత్ర, దాని ట్రాక్ రికార్డే కాంగ్రెస్‌కు గుదిబండగా మారనుం దని జోస్యం చెప్పారు.. బీజేపీ యుద్ధానికి ముందే చేతులెత్తేసిందనీ, దాని దుకాణం బంద్ అయిందనీ, రాష్ట్రంలో ఆ పార్టీ కథ ఒడిసిపో యిందని ఎద్దేవా చేశారు. 2018 ముందస్తు ఎన్నికల్లో బీజేపీ 105 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయిందనీ, ఈసారి 110 స్థానాల్లో ధరావతు కోల్పోనుందని చెప్పారు. అభ్యర్థుల జాబితా విడుదలతోపాటు ప్రచారంలోనూ అన్ని పార్టీల కంటే బీఆర్ఎస్ ముందుందనీ, అదే తరహాలో ఎన్నికల ఫలితాల్లోనూ తాము ముందుంటామని ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావా నికి ముందు వ్యవసా యం, పరిశ్రమలు, కరెంటు, ఉద్యోగ నియామకాలు, సంక్షేమ ం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి తదితరాం శాలు ఎలా ఉన్నాయి..? రాష్ట్రం వచ్చిన తర్వాత వాటి పరిస్థితేంటి..? అనే విషయాలను ఆయన ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌పైన, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపైనా కేటీఆర్ విరుచుకుపడ్డారు. 2004 నుంచి 2014 వరకూ కాంగ్రెస్ హయాంలో ఏపీపీఎస్సీ ద్వారా 24 వేల ఉద్యోగాలను ఇస్తే, తమ హయాంలో 2014



మిగతా 2లో

# త్వరలోనే బయటికొస్తా..!

**- జైలు నుంచి చంద్రబాబు బహిరంగ లేఖ**



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సుమారు 40 రోజులకు పైగా రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంటున్న సంగతి తెలిసిందే. ప్రజల మనిషిగా గుర్తింపు తెచ్చుకున్న బాబు.. జైలులో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజల గురించే ఆలోచిస్తున్నారు. దసరా సందర్భంగా తెలుగు ప్రజలకు జైలు నుంచి బహిరంగ లేఖ రాశారు. ప్రజలు, టీడీపీ శ్రేణులకు ధైర్యం చెబుతూ ఈ లేఖలో పలు విషయాలను ప్రస్తావించారు. 'నేను జైలులో లేను.. ప్రజల హృదయాల్లో ఉన్నాను. ప్రజల నుంచి నన్ను ఒక్క క్షణం కూడా ఎవ్వరూ దూరం చేయలేరు. 45 ఏళ్లుగా నేను కాపాడుకుంటూ వస్తున్న విలువలు, విశ్వసనీయతను ఎవరూ చెరిపేయలేరు. ఆలస్యమైనా న్యాయం గెలుస్తుంది.. నేను త్వరలో బయటకొస్తాను. ప్రజల కోసం, రాష్ట్ర ప్రగతి కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తాను. ఓటమి భయంతో జైలు గోడల మధ్య బంధించి ప్రజలకు నన్ను దూరం చేశామనుకుంటున్నారు. నేను ప్రస్తుతం ప్రజల మధ్యలో లేకపోవచ్చు.. అభివృద్ధి రూపంలో ప్రతీ చోటా కనిపిస్తాను. సంక్షేమం పేరు వినిపించిన ప్రతీసారి నా పేరే తలుస్తారు. తెలుగు ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు' అని లేఖలో బాబు రాశారు.

మిగతా 2లో

నా ప్రియాతి ప్రియమైన తెలుగు ప్రజలందరికీ నమస్కారాలు.

నేను జైలులో లేను. మీ అందరి గుండెల్లో ఉన్నాను. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ప్రజాచైతన్యంలో ఉన్నాను. విధ్వంస పాలనని అంతం చేయాలనే మీ సంకల్పంలో ఉన్నాను. ప్రజలే నా కుటుంబం. జైలు గోడల మధ్య కూర్చుని ఆలోచిస్తూ ఉంటే 45 ఏళ్ల ప్రజాజీవితం నా కళ్ల ముందు కదలాడుతోంది. నా రాజకీయ ప్రస్థానమంతా తెలుగు ప్రజల అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యంగా సాగింది. దీనికి ఆ దేవుడితో పాటు మీరే సాక్ష్యం.

ఓటమి భయంతో నన్ను జైలు గోడల మధ్య బంధించి ప్రజలకి దూరం చేశామనుకుంటున్నారు. నేను మీ మధ్య తిరుగుతూ ఉండకపోవచ్చు. కానీ అభివృద్ధి రూపంలో ప్రతీ చోటా కనిపిస్తూనే ఉంటాను. సంక్షేమం పేరు వినిపించిన ప్రతీసారి నేను గుర్తుకొస్తూనే ఉంటాను. ప్రజల్నించి ఒక్క రోజు కాదు కదా!, ఒక్క క్షణం కూడా నన్ను దూరం చేయలేరు. కుట్రలతో నాపై అవినీతి ముద్ర వేయాలని ప్రయత్నించారు కానీ.. నేను నమ్మిన విలువలు, విశ్వసనీయతని ఎన్నడూ చెరిపేయలేరు. ఈ చీకట్లు తాత్కాలికమే. సత్యం అనే సూర్యుడి ముందు కారుమబ్బులు వీడిపోతాయి. సంకెళ్లు నా సంకల్పాన్ని బంధించలేవు. జైలుగోడలు నా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేవు. జైలు ఊచలు నన్ను ప్రజల్నించి దూరం చేయలేవు. నేను తప్పు చేయను, చేయనివ్వను.

ఈ దసరాకి పూర్తి స్థాయి మ్యానిఫెస్టో విడుదల చేస్తానని రాజమహేంద్రవరం మహానాడులో ప్రకటించాను. అదే రాజమహేంద్రవరం జైలులో నన్ను ఖైదు చేశారు. త్వరలో బయటకొచ్చి పూర్తిస్థాయి మ్యానిఫెస్టో విడుదల చేస్తాను. నా ప్రజల కోసం, వారి పిల్లల భవిష్యత్తు కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తాను.

ఎప్పుడూ బయటకు రాని స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారి బిడ్డ, నా భార్య భువనేశ్వరిని నేను అందుబాటులో లేని ఈ కష్టకాలంలో ప్రజల్లోకి వెళ్లి వారి తరఫున పోరాడాలని నేను కోరాను. ఆమె అంగీకరించింది. నా అక్రమ అరెస్టుతో తల్లడిల్లి మృతి చెందిన వారి కుటుంబాలని పరామర్శించి, అరాచక పాలనను ఎండగట్టడానికి 'నిజం గెలవాలి' అంటూ మీ ముందుకు వస్తోంది.

జనమే నా బలం, జనమే నా ధైర్యం. దేశ విదేశాలలో నా కోసం రోడ్డెక్కిన ప్రజలు వివిధ రూపాల్లో మద్దతు తెలుపుతున్నారు. నా క్షేమం కోసం కుల, మత, ప్రాంతాలకు అతీతంగా మీరు చేసిన ప్రార్థనలు ఫలిస్తాయి. న్యాయం ఆలస్యం అవ్వొచ్చునేమో కానీ, అంతిమంగా గెలిచేది మాత్రం న్యాయమే. మీ అభిమానం, ఆశీస్సులతో త్వరలోనే బయటకి వస్తాను. అంతవరకూ నియంత పాలనపై శాంతియుత పోరాటం కొనసాగించండి. చెడు గెలిచినా నిలవదు, మంచి తాత్కాలికంగా ఓడినట్లు కనిపించినా కాలపరీక్షలో గెలిచి తీరుతుంది. త్వరలోనే చెడుపై మంచి విజయం సాధిస్తుంది.

అందరికీ విజయదశమి శుభాకాంక్షలతో..

మీ నారా చంద్రబాబు నాయుడు
స్నేహ బ్లాక్ , రాజమహేంద్రవరం జైలు నుంచి..

# కాంగ్రెస్‌కు 40 స్థానాల్లో అభ్యర్థుల్లేరు

(మొదటిపేజీ తరువాయి)
నుంచి ఇప్పటి దాకా లక్షా 34 వేల కొలువులను ఇచ్చామంటూ గుర్తు చేశారు. ఇంకా 90 వేల నియామకాలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఈ రకంగా చూసినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాదికి కేవలం వెయ్యి ఉద్యోగాలను మాత్రమే ఇస్తే.. బీఆర్ఎస్ సర్కారు సంవత్సరానికి 13 వేల ఉద్యోగాలను ఇచ్చిందని చెప్పుకొచ్చారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన, తాగు, సాగునీరు, పెట్టుబడులు, సంక్షేమం%ూ% ఇలా ఏ రంగంలోనూ కాంగ్రెస్ తమతో పోటీ పడలేదని విమర్శించారు. ఈ వాస్తవాలన్నింటినీ మరిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ%ూ% బీఆర్ఎస్‌ది కుటుంబ పార్టీ, కేసీఆర్ హయాంలో ఇసుక మాఫియా, అవినీతి పెరిగిందంటూ వ్యాఖ్యానించటం విడ్డూరంగా ఉందన్నారు. ఈసారి రాష్ట్రానికి వచ్చేటప్పుడు కొంచెం తెలుసుకుని రండంటూ రాహుల్‌కు చురకలంటించారు. కర్నాటక ఎన్నికల్లో అనేక హామీలను గుప్పించిన కాంగ్రెస్ ఇప్పుడు అక్కడ ఐదు గంటలపాటు కరెంట్ కోతలు విధిస్తోందని విమర్శించారు. తెలంగాణలో మాదిరిగా చత్తీస్‌ఘడ్‌లో పండిన ప్రతీ గింజనూ అక్కడి ప్రభుత్వం కొంటున్నదా..? అని ప్రశ్నించారు. వీటిపై సమాధానం చెప్పకుండా సుద్దులు చెబితే ఎలా అంటూ నిలదీశారు.

ఎన్నికల సమయం కాబట్టి వివిధ పార్టీల్లో చేరికలు కొనసాగుతుండటం సహజమేనని కేటీఆర్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అయితే బీఆర్ఎస్ నుంచి నాయకులు వెళ్లిపోయినంత మాత్రాన ఓటర్లు మాత్రం మారబోరని చెప్పారు. గత ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో పార్టీకి నేతలు అనేక మంది ఉన్నా ఒక్క సీటును గెలిచాం, కానీ ఇప్పుడు అనేక మంది పార్టీని వీడారు, అందువల్ల అక్కడ సీట్లు పెరుగుతాయని భావిస్తున్నామని వ్యాఖ్యానించారు. వ్యక్తులు మారినంత మాత్రాన వ్యవస్థ మారబోదని యన కామెంట్ చేశారు. ఖమ్మం జిల్లాలో కొంత మంది నేతలు పార్టీని శాసించే స్థితికి వెళ్లిపోయారు, అందువల్ల కఠినంగా ఆలోచించి ధృఢ నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. లెఫ్ట్ పార్టీలను ఎందుకు దూరం చేసుకున్నారంటూ విలేకరులు అడగ్గా 'వామపక్షాలంటే మాకు గౌరవం లేక కాదు.. లెక్క కుదరలేదంతే%ూ%ప్రతిపక్షాలకు అవకాశమివ్వకూడదని భావించాం. ఏదేమైనా ఆయా పార్టీలకు బీఆర్ఎస్ దూరమవటం దురదృష్టకరం అని సమాధానమిచ్చారు. రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నది బీఆర్ఎస్, వామపక్షాలేనని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ నాయకత్వ పటిమపై ఉన్న అచంచల విశ్వాసమే తమ పార్టీని విజయ తీరాలకు చేరుస్తుందని కేటీఆర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఈ సారొస్తే..జాబ్ క్యాలెండర్**

రాష్ట్రంలో ఇప్పటికే అమలవుతున్న పథకాలపై ఎన్నికల సంఘం ఆంక్షలు విధించటం గురించి ప్రస్తావించగా పథకాలొక్కటే కాదు, కరెంటు ఇవ్వొద్దంటూ డిస్కామ్‌ల మీద ఒత్తిడి తెస్తున్నారు.. నిధులు విడుదల చేయొద్దంటూ ఆర్థిక సంస్థల మీద ఆంక్షలు విధిస్తున్నారు.. గత తొమ్మిదిన్నరేండ్లుగా అనేక రకాల ఇబ్బందులు పెట్టారు అంటూ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలకు సంబంధించి జాబ్ క్యాలెండర్‌ను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. 'ఉద్యమకారులందర్నీ బీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నారు కదా.. మరి కోదండరామ్‌ను చేర్చుకుంటారా..' అని అడగ్గా ఆయన ఇప్పటికే రాహుల్ గాంధీని కలిశారు కదా.. అని ఎదురు ప్రశ్నించారు. కాంగ్రెస్ అనేది కుంభకోణాల కుంభమేళా అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడితే బీఆర్ఎస్ అనేది బీజేపీకి బీ–టీమ్ అంటున్నారనీ, వాస్తవానికి మహారాష్ట్రలో మతతత్వ పార్టీ అయిన శివసేనతో కలిసి నిన్నటిదాకా ప్రభుత్వంలో ఉన్నది కాంగ్రెస్ కాదా.. అని ప్రశ్నించారు. మేఘాలయలో మొన్నటిదాకా కాంగ్రెస్, బీజేపీ కలిసే పని చేశాయని గుర్తు చేశారు. మక్తల్, మణికొండ మున్సిపాల్టీల్లో ఇప్పుడు కూడా ఆ రెండు పార్టీలు కలిసే పని చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీల రాష్ట్ర నేతలు ఢిల్లీకి బానిసలంటూ ఆయన ఈ సందర్భంగా ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎంఐఎం అనేది మతతత్వ పార్టీ కాదనీ, అది తమకు ఫ్రెండ్లీ పార్టీ అని చెప్పుకొచ్చారు.

# త్యాగాలతోనే విజయాలు సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)
అర్పించారని ఆయన కొనియాడారు. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు విధి నిర్వహణలో 189 మంది పోలీసులు అమరులయ్యారని ఆయన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా మొక్కవోని దీక్షతో పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని నేరస్థుల కుట్రలను ఎప్పటికప్పుడు భగం చేయాల్సినవసరం ఉన్నదని అన్నారు. దేశంలోనే అత్యుత్తమ పోలీసు వ్యవస్థగా రాష్ట్ర పోలీసు శాఖ నిలిచిందనీ, ముఖ్యంగా షీ టీమ్స్ మహిళల భద్రత విషయంలో సాధిస్తున్న విజయాలకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందనీ, పలు అవార్డులు కూడా లభించాయని ఆయన అన్నారు. అలాగే, పాస్‌పోర్టు జారీ వ్యవస్థలో పోలీసు శాఖ విధులు అత్యంత చురుకుగా సాగి అందరి మన్ననలు అందుకున్నా యని ఆయన అన్నారు. అంతకముందు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద డీజీపీ అంజనీకుమార్‌తో పాటు నగర పోలీసు కమిషనర్లు సందీప్ శాండిల్య, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ అనిల్ కుమార్, ఇతర సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్లు శివధర్‌రెడ్డి, సౌమ్య మిశ్రా, జితేందర్, కె. శ్రీనివాస్‌రెడ్డి, సంజరు జైన్ లు పుష్ప గుచ్చాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. వీరితో పాటు పలువురు రిటైర్డ్ డీజీపీలు, సీనియర్ ఐపీఎస్ అధికారులు కూడా స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు నిర్వహించిన అమరవీరుల సంస్మరణ కవాతు అత్యంత ఆకర్షణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమంలోనే 'అమరులు వీరు' అనే పుస్తకాన్ని డీజీపీ ఆవిష్కరించారు. అలాగే, పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలిగా పలువురు పోలీసులు రక్తదానం చేశారు.

# రసవత్తరం.. రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)
రాత్రింబవళ్లు సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ కేడర్‌ను కట్టుదిట్టం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు.

కంచుకోటలా మలుచుకున్న మల్కాజిగిరిని ఈసారి సైతం 'చే'జారి పోకుండా విజయం సాధించి అధికార పార్టీకి తన సత్తా ఏంటో చూపాలన్న పట్టుదలతో ఉన్న మైనంపల్లి, మల్కాజిగిరితో పాటు మెదక్‌లోనూ పట్టు సాధించుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. ముమ్మరంగా పర్యటిస్తూ ఆత్మీయ, కుల సంఘాల సమావేశాలు, కాలనీ సంక్షేమ సంఘాలతో కలుస్తున్నారు. అదే స్థాయిలో ఇటు అధికార పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి సైతం నిత్యం ప్రజల మధ్యన తిరుగుతూ బస్తీలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ బీఆర్ఎసతోనే అభివృద్ధి.. ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే మనకు శ్రీరామరక్ష అంటూ ప్రజల్లో సుస్థిర స్థానం సంపాదించుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు. మైనంపల్లికి పార్టీ ఏం తక్కువ చేసిందని ఆయన రాజీనామా చేశారోప్రజలు అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు.

**బీజేపీలో తెరపైకి ఆకుల పేరు**

ఇప్పటి వరకు బీజేపీ అభ్యర్థిని ఖరారు చేయలేదు. కాగా, సీనియర్ నేత ఎన్. రామచందర్‌రావు పేరే వినిపిస్తుండగా ప్రజల్లో ఆయన పట్ల కాస్త వ్యతిరేకత ఉందనే సంకేతాలతో పోటీకి నిరాకరించడం కారణమో తెలియదు కాని రెండు రోజులుగా తెరపైకి మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ పేరు వినిపిస్తోంది. అలాగే బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్, మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్, బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయిప్రసాద్ పేర్లు కూడా ప్రచారం జరుగుతున్నాయి. కాగా, ఆకుల రాజేందర్ మల్కాజిగిరి నియోజకవర్గానికి మొట్టమొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. ఈ పరిస్థితుల్లో మల్కాజిగిరిలో మక్కోణపు పోటీ తప్పదని.. ముగ్గురు ముగ్గురే అని ఇక మల్కాజిగిరిలో రాజకీయ రణరంగాన్ని తలపిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదని పరిశీలకులు భావిస్తున్నారు.

**ప్రచారంలో ముందున్న బీఆర్ఎస్, కాంగ్రెస్**

ఎన్నికలు సమీపిస్తుండడంతోగా ప్రధాన పార్టీల నాయకులు నియోజకవర్గంలోని ఆయా డివిజన్‌లలో పట్టు ఉన్న నేతలను చేర్చుకునేలా వ్యూహాలకు పదను పెడుతున్నారు. అధికార పార్టీలో అసంతృప్తులను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ చక్రం తిప్పుతున్నాయి. నియోజకవర్గంలో బీఆర్ఎసతోపాటు కాంగ్రెస్, బీజేపీల్లోని ముఖ్య నేతలు వర్గాలుగా విడిపోయారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే హనుమంతరావు కాంగ్రెసలోకి చేరాక ఆయన వెంట బీఆర్ఎసకు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు కూడా వెళ్లారు. ఆయనకు కాంగ్రెస్ శ్రేణులూ మద్దతు ప్రకటించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ ఇతర పార్టీలకు చెందిన ముఖ్య నేతలను తన వైపు తిప్పుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన మర్రి రాజశేఖరరెడ్డి అధికార పార్టీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లతో పాటు కాంగ్రెసకు చెందిన వారిని బీఆర్ఎసలో చేర్చుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇక బీజేపీ నేతలు తమ కేడర్‌ను ఎటూ వెళ్లనీయకుండా జాగ్రత్త పడుతున్నారు.

## తెలంగాణలో అధికారం తేల్చేసింది

(మొదటిపేజీ తరువాయి)
తేలిపోయింది. ప్రస్తుతం ఈ సర్వే తెలంగాణ రాజకీయాల్లో, ఎన్నికల్లో పెను సంచలనంగా మారింది. తాజా సర్వేను బట్టి చూస్తే బీఆర్ఎస్ షాకేనని చెప్పుకోవచ్చు. అయితే.. బీజేపీ ఇప్పుడున్న పరిస్థితి నుంచి ఏ మాత్రం పుంజుకున్నా ప్రభావం ఉండదని సర్వే తేల్చేసింది. ఇండియా టుడే–సీ ఓటర్ సర్వే ఏం తేల్చింది..?

**కాంగ్రెస్ : 54 సీట్లు**
**బీఆర్ఎస్ : 49 సీట్లు**
**బీజేపీ : 08 సీట్లు**

**ఓట్ల శాతం :-**
**కాంగ్రెస్ : 39 శాతం**
**బీఆర్ఎస్ : 38 శాతం**



**ఏం జరుగుతుందో..?**

ఇండియా టుడే– సీ ఓటర్ సర్వేను నిశితంగా పరిశీలిస్తే.. కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య నువ్వా–నేనా అన్నట్లుగా పోటీ ఉందని స్పష్టంగా అర్థం అవుతోంది. అంతేకాదు.. కేసీఆర్ పాలనా వైఫల్యాలను సైతం సీఓటర్ సర్వే నిశితంగా చర్చించి.. వివరించింది కూడా. ఈ సర్వేతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఎనలేని ఉత్సాహం వచ్చింది. మరోవైపు.. ఇంత పెద్ద సంస్థ చేసిన సర్వేలోనే ఇన్ని సీట్లు వస్తాయని తేలిందంటే పరిస్థితి ఏంటని గులాబీ పార్టీ పెద్దలు ఆలోచనలో పడ్డారట. ఇవాళ సాయంత్రం లేదా.. రేపు ఉదయం పార్టీ ముఖ్యులతో కేసీఆర్ సమావేశం అవుతారని తెలిసింది. ఇప్పటి వరకూ సొంత సర్వేలు.. సొంత సంస్థలతోనే కాంగ్రెస్ ఇలా చేయించిందని విమర్శలు గుప్పించిన బీఆర్ఎస్ నేతలు.. తాజా సర్వేపై ఎలా రియాక్ట్ అవుతారనేదానిపై రాష్ట్ర ప్రజల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# త్వరలోనే బయటికొస్తా..!

**మేనిఫెస్టో రిలీజ్ చేస్తా..!**

'జైలు గోడల మధ్య కూర్చుని ఆలోచిస్తూ ఉంటే 45 ఏళ్ల ప్రజా జీవితం నా కళ్ల ముందు కదలాడుతోంది. నా రాజకీయ ప్రస్థానమంతా తెలుగు ప్రజల అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యంగా సాగింది. కుట్రలతో నాపై అవినీతి ముద్ర వేయాలని ప్రయత్నించారు కానీ.. నేను నమ్మిన విలువలు, విశ్వసనీయతని ఎన్నడూ చెరిపే యలేరు. ఈ చీకట్లు తాత్కాలికమే.. సత్యం అనే సూర్యుడి ముందు కారుమబ్బులు వీడిపోతాయి. సంకెళ్లు నా సంకల్పాన్ని బంధిం చలేవు. జైలు గోడలు నా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయలేవు. జైలు ఊచలు నన్ను ప్రజల నుంచి దూరం చేయలేవు. నేను తప్పు చేయను.. చేయనివ్వను. ఈ దసరాకి పూర్తిస్థాయి మ్యానిఫెస్టో విడుదల చేస్తానని రాజమహేం ద్రవరం మహానాడులో ప్రకటిం చాను. అదే రాజమహేంద్రవరం జైలులో నన్ను ఖైదు చేశారు. త్వరలో బయటకొచ్చి పూర్తిస్థాయి మ్యానిఫెస్టో విడుదల చేస్తాను' అని పార్టీ శ్రేణులకు, రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు అభయమిచ్చారు.

**నా బలం, ధైర్యం మీరే!**

'నా ప్రజల కోసం, వారి పిల్లల భవిష్యత్తు కోసం రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తాను. ఎప్పుడూ బయటకు రాని స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి బిడ్డ, నా భార్య భువనేశ్వరిని నేను అందుబాటులో లేని ఈ కష్టకాలంలో ప్రజల్లోకి వెళ్లి వారి తరఫున పోరాడాలని నేను కోరాను. ఆమె అంగీకరించింది. నా అక్రమ అరెస్టుతో తల్లడిల్లి మృతి చెందిన వారి కుటుంబాలని పరామర్శించి, అరాచక పాలనను ఎండగట్టడానికి "నిజం గెలవాలి" అంటూ మీ ముందుకు వస్తోంది. జనమే నా బలం, జనమే నా ధైర్యం. దేశవిదేశాలలో నా కోసం రోడ్డెక్కిన ప్రజలు వివిధ రూపాల్లో మద్దతు తెలుపుతున్నారు. నా క్షేమం కోసం కుల, మత, ప్రాంతాలకు అతీతంగా మీరు చేసిన ప్రార్థనలు ఫలిస్తాయి. న్యాయం ఆలస్యం అవ్వొచ్చునేమో కానీ, అంతిమంగా గెలిచేది మాత్రం న్యాయమే. మీ అభిమానం, ఆశీస్సులతో త్వరలోనే బయటకి వస్తాను. అంతవరకూ నియంత పాలనపై శాంతియుత పోరాటం కొనసాగించండి. చెడు గెలిచినా నిలవదు.. మంచి తాత్కాలికంగా ఓడినట్లు కనిపించినా కాలపరీక్షలో గెలిచి తీరుతుంది. త్వరలోనే చెడుపై మంచి విజయం సాధిస్తుంది' అని లేఖలో చంద్రబాబు రాశారు. ప్రస్తుతం ఈ లేఖ గురించే ఏపీ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మరోవైపు.. టీడీపీ శ్రేణులు ఈ లేఖను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

# 24 గంటల్లో 9.69 కోట్లు స్వాధీనం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా డబ్బు, బంగారం, మత్తుపదార్థాలు పట్టుబడుతున్నాయి. అక్టోబర్ 20వ తేదీ ఉదయం 9 నుంచి 21వ తేదీ ఉదయం 9 గంటల వరకు 24 గంటల్లో రూ.9.69 కోట్ల నగదు పట్టుబడింది. దీనితో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి 21వ తేదీ వరకు స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు రూ.105.58 కోట్లకు చేరింది. అలాగే గడచిన 24 గంటల్లో అక్రమంగా సరఫరా చేస్తున్న 31,961 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.35 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. దీనితో ఈనెల 9 నుంచి 21వ తేదీ వరకు మొత్తం రూ.13.58 కోట్లు విలువైన 72,302 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గడచిన 24 గంటల్లో రూ.72.34 లక్షలు విలువైన 232.73 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనితో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈనెల 21వరకు మొత్తం రూ.15,23 కోట్లు విలువైన 3,672.795 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు అధికారు లు తెలిపారు.

# అమరుల త్యాగాల స్ఫూర్తి

**- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర**

**సైబరాబాద్ కమిషరేట్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం**




**మియాపూర్-- ప్రభాత సూర్యుడు**

పోలీసు అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. శనివారం సైబరాబాద్ కమిషరేట్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్మారక స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసులు జాతి సేవకు పునరంకితం కావాలన్నారు. విధి నిర్వహణలో అసువు లుబాసిన పోలీసుల త్యాగాలను నిత్యం స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. దేశ భద్రత చూసుకునే బాధ్యత సైనికులదైతే, దేశంలోని అంతర్గత భద్రత చూసుకునే బాధ్యత పోలీసులదని చెప్పారు. సమాజంలో ఎవరికి ఏ కష్టం, నష్టం, వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసేనని అన్నారు. ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు ప్రజారక్షణ, శాంతి పరిరక్షణ కోసం నిరంతరం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉండి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల కోసం జీవించి, మరణించే పోలీసులకి.. ప్రాణాలని పణంగా పెట్టి ప్రజల కోసం చేసిన త్యాగానికి గౌరవం చూపించడం మనందరి బాధ్యత అన్నారు. పోలీసులు విధి నిర్వహణలో క్రమశిక్షణతో పని చేయాలన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా దాదాపు 189 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ అడిషనల్ సీపీ అడ్మిన్ అవినాష్ మహంతి, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, డీసీపీ అడ్మిన్ రవిచందన్‌రెడ్డి, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, మాదాపూర్ డీసీపీ సందీప్, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, మేడ్చల్ డీసీపీ శబరీష్, డీసీపీ రోడ్ సేఫ్టీ ఎల్‌సి నాయక్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీస్‌డబ్ల్యూ ఏడీసీపీ శ్రీనివాస్ రావు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఏఓ అకౌంట్స్ చంద్రకళ, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజ్ ప్రమాదానికి కేసీఆర్ కుటుంబమే కారణం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** మేడిగడ్డ వద్ద లక్ష్మీ బ్యారేజ్ పిల్లర్ కుంగిపోయిన ఘటనపై తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీ బ్యారేజ్ వద్ద పిల్లర్ కుంగిపోవడానికి కారణం కేసీఆర్ కుటుంబమేనని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిలో మొదటి దోషి కేసీఆర్ కుటుంబం అని విమర్శించారు. నాణ్యతా లోపంతోనే మేడిగడ్డ ప్రమాదం చోటు చేసుకుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.1 లక్ష కోట్లను కేసీఆర్, కాంట్రాక్టర్లు దోచుకున్నారని రేవంత్ మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడంపై సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ తో దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని వెల్లడించారు. మేడిగడ్డ ఘటనపై కేంద్ర హోంమంత్రి, గవర్నర్, ఈసీ విచారణకు ఆదేశించాలని కోరారు. మేడిగడ్డకు వెళ్లేందుకు ఈసీకి లేఖ రాస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. కేటీఆర్, హరీశ్ రావు కూడా తమతో కలిసి మేడిగడ్డకు రావాలని డిమాండ్ చేశారు.



## సంపాదకీయం

# రాజకీయాల్లోకి ప్రభుత్వ ఉద్యోగులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవడంతో రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టేశారు. నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించి, ప్రత్యర్థులపై పైచేయి సాధించారు. ఇప్పటికే మెజార్టీ అభ్యర్థులకు బీఫారాలను అందజేశారు. బీఫారాలు అందుకున్న నేతలు నియోజకవర్గాల్లో ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. ఇటు కేసీఆర్ ప్రతి రోజు 2, 3 నియోజకవర్గాలను తిరుగు తున్నారు. అటు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తెలంగాణలో ప్రచారాన్ని మొదలు పెట్టేశారు. కేసీఆర్ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారు. మరోవైపు ఎన్నికల్లో పోటీ చేసేందుకు తెలుగు రాష్ట్రాల్లోని అధికారులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేసి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని పలువురు అధికారులు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా ఎన్నికల్లో పోటీ చేశారు. కొందరు రాజకీయాల్లోనూ సక్సెస్ అందుకున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం ద్వారా ప్రజలకు మరింత సేవ చేయవచ్చని, వారి సమస్యలకు పరిష్కారానికి పాటు పడవచ్చని అంటున్నారు. గెజిటెడ్ అధికారుల నుంచి ఐఏఎస్, ఐపీఎస్ ల వరకూ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన ఆయన వైద్య, ఆరోగ్య శాఖలో సూపరింటెండెంట్ గా పని చేస్తున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేస్తూ వీఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకున్నారు. మామిళ్ల రాజేందర్ దరఖాస్తును పరిశీలించిన ఉన్నతాధికారులు, ఆయన వీఆర్ఎస్ దరఖాస్తుకు ఆమోదముద్ర వేశారు. త్వరలోనే ఆయన భారత రాష్ట్ర సమితిలో చేరనున్నట్లు తెలుస్తోంది. బీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాద్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఐఆర్ఎస్ అధికారిగా పని చేసిన ఏపీ మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ టీఎన్జీవో అధ్యక్షులు స్వామిగౌడ్, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐఏఎస్ అధికారి రామాంజినేయులు ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా చాంతాడంతా ఉంది. మొన్నటి వరకు ఏపీలో ఐఏఎస్ అధికారులుగా పని చేసిన విజయ్ కుమార్, కరికాళవళవన్ రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. విజయ్ కుమార్, కరికాళవళవన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీరిలో కొందరు స్వచ్ఛందంగా ఉద్యోగాలకు రాజానామా చేస్తే, మరికొందరు రిటైర్ మెంట్ అయ్యాక రాజకీయాల్లోకి ప్రవేశించారు. సీఐగా పని చేసిన గోరంట్ల మాధవ్ వైసీపీ తరఫున హిందూపురం ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. తెలంగాణ ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్ గౌడ్ టీఎన్జీవో అధ్యక్షుడిగా పని చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన మహబూబ్ నగర్ నుంచి పోటీ చేశారు. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్నారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసినా సక్సెస్ కాలేకపోయారు. ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ఐఆర్ఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. 2014, 2019 ఎన్నికల్లో గెలుపొందారు. జగన్మోహన్ రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పని చేస్తున్నారు.

# గెలుపు ధీమాలో కాంగ్రెస్

వరంగల్- ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మూడు రోజుల పాటు తెలంగాణలో పర్యటించారు. ములుగు జిల్లాతో పాటు కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో ఆయన పర్యటించారు. ఆయన స్ట్రీట్ మీటింగ్స్‌కు బహిరంగ సభలకు జనం పోటెత్తారు. రాహుల్ విమర్శలు కూడా సూటిగా సుత్తిలేకుండా సాగాయి. తెలంగాణ రాష్ట్రం తాము ఏ పరిస్థితుల్లో ఇచ్చింది? దాని వల్ల రాజకీయంగా ఎంత నష్టపోయింది కూడా వివరించారు. కేసీఆర్ కుటుంబ పాలనపై రాహుల్ ధ్వజమెత్తారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక తాను ముక్కలేనంటూ పదే పదే ఆ మూడింటిపై విమర్శలు చేస్తూ ఆయన ముందుకు సాగారు. రాహుల్ ప్రసంగానికి జనం కనెక్ట్ అయినట్లే కనిపించింది. వాటిని తిని మంచి రెస్పాన్స్... రాహుల్ ప్రతి డైలాగ్‌కు ప్రజల నుంచి వచ్చిన స్పందన చూస్తే ఆయనను చూసేందుకు మాత్రమే కాకుండా ప్రసంగం వినడానికి కూడా ఎక్కువ మంది హాజరయినట్లు జిల్లాల నుంచి అందుతున్న సమాచారం. తొలిరోజు రాహుల్, ప్రియాంక గాంధీలు రామప్ప గుడిని సందర్శించడం అక్కడి నుంచి బస్సు యాత్రను ప్రారంభించి నేరుగా ములుగు జిల్లాకు వెళ్లి అక్కడ బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సభలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పాటు అదనపు హామీలను కూడా ఇచ్చింది. తాము అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి, షాదీతోఫా కింద ఆడపిల్లల కుటుంబాలకు లక్ష రూపాయల నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని కూడా ఇచ్చిన హామీకి బాగానే రెస్పాన్స్ వచ్చింది. తొలి జాబితా అభ్యర్థుల ప్రకటన తర్వాత రాహుల్, ప్రియాంకలు తెలంగాణలో పర్యటించారు. అయితే ఫస్ట్ లిస్ట్ సామాజకవర్గాల పరంగా, నియోజకవర్గాల్లో సర్వేల ఆధారంగా ప్రకటించడంతో అనుకున్న స్థాయిలో అసంతృప్తి కనిపించలేదు. దీనికి తోడు రాహుల్ పర్యటన పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపిందనే చెప్పాలి. తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పర్చే బాధ్యత తనదేనని రాహుల్ చెప్పడం కూడా ఆకట్టుకుంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తాము ఏ విధమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తుందీ కూడా ఆయన చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీ కూడా వైరల్ గా మారింది. యువత, మహిళలను ఆకట్టుకునేలా రాహుల్ ప్రసంగం సాగింది. మూడు రోజుల పర్యటనలో మూడు జిల్లాల్లోనూ మంచి స్పందన లభించింది. దీంతో తెలంగాణ శాసనసభ ఎన్నికలు నవంబరు 30 అంటే మిగిలిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతుండటంతో చివరి పది రోజులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇక్కడే మకాం వేసి కాంగ్రెస్‌కు మరింత ఊపు తెచ్చే ప్రయత్నం చేయనున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ బలంగా ఉన్న ప్రాంతాల్లోనే వీరి పర్యటనకు రాష్ట్ర కాంగ్రెస్ ప్లాన్ చేస్తుంది. మరి రాహుల్ పర్యటనతో ఈసారైనా తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కుతుందా? లేదా? అన్నది డిసెంబరు 3వ తేదీన తేలనుంది.

# వలసలతో నల్గొండ కాంగ్రెస్ జోష్




**నల్గొండ- ప్రభాత సూర్యుడు :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు కౌంట్ డౌన్ దగ్గర పడుతుండడంతో నేతలు పార్టీ కండువాలు మార్చేస్తున్నారు. టికెట్ రాలేదని, అసమ్మతితో ఇలా వివిధ కారణాలతో నేతలు పార్టీలు జంప్ చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో బయటి నుంచి వస్తున్న ఆఫర్లను కాదనలేక కొందరు.. ఇప్పటి దాకా ఎమ్మెల్యేలపై అసమ్మతి రగిలిపోయిన కొందరు కొత్తదారులు వెదుక్కుంటున్నారు. ఆయా నియోజక వర్గాల్లో పార్టీ నుంచి కాంగ్రెస్, బీజేపీల్లోకి వెళ్లిపోతున్న వారి సంఖ్య పెరగడంతో అభ్యర్థులు ఒత్తిడికి గురవుతున్నారు. నల్లగొండ, నకిరేకల్, నాగార్జున సాగర్, హుజూర్ నగర్, కోదాడ.. ఇలా పలు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేల తీరు నచ్చక, ఇన్నాళ్లూ ఓపిక పట్టినా.. ఇప్పుడు ఎన్నికల సమయం కావడంతో ఇక ఏం చేయలేరన్న ఆలోచనతో స్థానిక ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు గులాబీ కండువాను పక్కన పడేసి ఎక్కువగా కాంగ్రెస్ కండువాను కప్పుకుంటున్నారు. కొందరు కాషాయ కండువాలూ కప్పుకున్నారు. వారం రోజులుగా బీఆర్ఎస్ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. నల్లగొండ నియోజక వర్గంలో బీఆర్ఎస్ కు పెద్ద షాకే తగిలింది. కాంగ్రెస్ అభ్యర్థిగా పేరు ప్రకటించగానే నియోజకవర్గానికి చేరుకున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండలో చక్రం తిప్పారు. ఒకే రోజు ఆరుగురు బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లను లాగేసుకున్నారు. వీరిలో నల్లగొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కూడా ఉన్నారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు బుధవారం కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. రెండు రోజుల్లో ఏకంగా ఎనిమిది మంది మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీని వీడడం ఈ ఎన్నికల్లో ప్రభావం చూపనుందన్నఅభిప్రాయం వ్యక్తమవుతోంది. నల్లగొండ నియోజకవర్గంలో రూరల్ ఓటర్ల కన్నా.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ఓటర్లే అధికం. కాంగ్రెస్ కు ఉన్న కౌన్సిలర్లకు తోడు కొత్తగా ఎనిమిది వచ్చి చేరడం ఈ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కు మంచి బలం చేకూరినట్లే. ఈ పరిణామం స్థానిక ఎమ్మెల్యే, అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డికి ఇబ్బందికరంగా మారనుంది. కోదాడ నియోజకవర్గంలో సిట్టింగ్ అభ్యర్థిని మార్చాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులు పట్టపడుతున్నారు. కానీ, పార్టీ నాయకత్వం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కే బి ఫారం ఇవ్వడంతో అసమ్మతి నాయకులంతా మూకుమ్మడిగా పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.శశిధర్ రెడ్డి, మైనారిటీ నాయకుడు మహ్మద్ జానీ, డీసీసీబీ మాజీ చైర్మన్ పాండురంగారావు, మరో నాయకుడు ఎర్నేని బాబ ఇలా అంతా పార్టీ మారేందుకు సిద్ధపడ్డారు. విషయం తెలుసుకుని కాంగ్రెస్ నాయకుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి నేరుగా వేనేపల్లి చందర్ రావు ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. వీరంతా ఢిల్లీలో కాంగ్రెస్ కండువాలు కప్పుకునేందుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ పరిణామం బీఆర్ఎస్ నాయకత్వానికి మింగుడు పడేలా లేదు. నాగార్జున సాగర్ బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ కూ ఇబ్బందులు మొదలయ్యాయి. ఆయన అభ్యర్థిత్వాన్ని ముందు నుంచీ పార్టీలోని ఒక వర్గం వ్యతిరేకిస్తోంది. అయినా.. హైకమాండ్ పట్టించుకోలేదు. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కుందూరు జైవీర్ రెడ్డి ప్రకటించగానే ఆయన తండ్రి, పార్టీ సీనియర్ కుందూరు జానారెడ్డి రంగంలోకి దిగి పార్టీ బలం మరింత పెంచే దిశగా పావులు కదుపుతున్నారు. నిడమనూరు మండలంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ లోకి తీసుకువచ్చారు. గుర్రంపోడు మండలంలో ఏకంగా పన్నెండు మంది సర్పంచులు, ఒక జెడ్పీటీసీ సభ్యుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులను బీఆర్ఎస్ నుంచి తీసుకువచ్చి కాంగ్రెస్ కండువాలు కప్పారు. దీంతో బీఆర్ఎస్ నాయకత్వం ఖంగుతిన్నది. పార్టీలో అంతర్గత వర్గాలకు తోడు.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఖాళీ అవుతుండడం ఆందోళనకు కారణమవుతోంది. హుజూర్ నగర్ నియోజకవర్గం పరిధిలోని నేరెడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీలతా రెడ్డి, నాగార్జున సాగర్ నుంచి మన్నెం రంజిత్ యాదవ్ తదితరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోనూ ఇన్నాళ్లూ బలవంతంగా బీఆర్ఎస్ లో కొనసాగిన వారు.. తిరిగి తమ సొంత గూడు కాంగ్రెస్ కు చేరుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మెజారిటీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి విరుగుడుగా అక్కడక్కడా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని, కొందరు స్థానిక ప్రజాప్రతినిధులను బీఆర్ఎస్ తీసుకుంటోంది. కానీ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ కు వెళ్లే వారి సంఖ్యే ఎక్కువగా ఉంటోంది.

# ఖరీదైనదిగా మారిన బతుకమ్మ ఆటాపాట

## నేడు సద్దుల బతుకమ్మ



**ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ సందడి చివరి అంకానికి చేరింది. ఆదివారం జరగనున్న చివరి.. పెద్ద బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మ కోసం మార్కెట్లు పూలతో నిండాయి. పుడమితో జలంతో పూలతో మానవుల కున్న అనుబంధంతో జరుపుకునే పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు తీరొక్క పూలతో జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేక సంస్కృతిని చాటుతోంది. ప్రకృతిలో సహజంగా దొరికే పూలతో పేర్చి ఆరాధిస్తూ ఆడిపాడే బతుకమ్మ పండుగకు ఈసారి పూల ధరలు భారంగా మారాయి.**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** ఊరూ వాడా యాడ చూసినా బతుక మ్మల సందడే కనిపిస్తోంది. పట్టణాల్లో మార్కె ట్లన్నీ పూలరాసులతో నిండిపోయాయి. కానీ,పూల ధరలు పెరగడంతో కిలోల కొద్దీ కొనే పరిస్థితి లేదని మహిళలు వాపోతున్నారు. తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ పండుగ ఎంగిలిపూలతో ప్రారంభమై సద్దల బతుకమ్మతో ముగుస్తుంది. ప్రతి ఏటా దసరా పండుగకు ముందు వచ్చే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిస్తోంది. తంగెడు పూలు, గునుగుపూలు, చామంతి, బంతి, తామర, గడ్డిపూలు ఇలా అనేక రకాల పూలతో బతుకమ్మను పేర్చుతారు. తొమ్మిది రోజుల పాటు వివిధ పద్ధతుల్లో బతుకమ్మల్ని తయారు చేసి ఆడపడుచులు ఆడిపాడుతారు. చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకల్ని భారీఎత్తున జరుపుకుంటారు. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహిస్తుండటంతో ఊరూవాడల్లోనే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రయివేట్ కార్యాలయాలు, కంపెనీలు ఇలా ప్రతి చోటా మహిళలు, ఉద్యోగులు, యువతులు బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్నారు.

### పూల పండుగకు ధరల భారం

గతేడాది కంటే ఈసారి బతుకమ్మ పండుగ సీజన్‌లో పూల ధరలు రెండింతలు పలుకుతున్నాయి. బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో బంతి, చామంతి, పట్టుగుచ్చు, లిల్లి, గునుగు, గడ్డిపూలు, మల్లె, తామర, గులాబీ వంటి పూల ధరలు మండిపోతున్నాయి. హైదరాబాద్ సహా సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, జహీరాబాద్, పటాన్‌చెరు, గజ్వేల్ వంటి పట్టణాల్లో పూల ధరలు మండిపోతున్నాయి. బంతి పూలు తప్ప మిగతా అన్ని రకాల పూల ధరలు పెరిగాయి. చామంతి పూలు కిలో రూ.200, పట్టుగుచ్చు పూలు కిలో రూ.150 వరకు అమ్ముతున్నారు. సెంట్‌రోజా పూలు కిలో రూ.500 ఉంది. కనకాంబరాలు మూర రూ.100, మల్లెపూలు మూర రూ.80 వరకు ఉన్నాయి. గతేడాది కిలో మల్లెపూల ధర రూ.600 ఉండగా, ఈసారి రూ.1200 పలుకుతోందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటే

- జస్టిస్ చంద్రకుమార్



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనని జస్టిస్ చంద్రకుమార్ విమర్శించారు. తెలంగాణ సమాఖ్య (సంఘాలు) ఆర్గనైజింగ్ కన్వీనర్ కరుణాకర్ దేశాయి అధ్యక్షతన శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ సమాఖ్య సంఘాల ఉమ్మడి మ్యానిఫెస్టో, ప్రజా సంఘాల మ్యానిఫెస్టోల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ, కేంద్ర హౌంశాఖ మంత్రి అమిత్ షాలు పదే పదే సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎంలాగా మారిందని విమర్శలు చేస్తారే తప్ప%ా%చర్యలెందుకు తీసుకోరని ప్రశ్నించారు. ఎంఐఎం అధినేత ఓవైసీ మైనార్టీల భద్రత, సంక్షేమం కోసం ఉన్నానంటూ చెప్పుకుంటూ వివిధ రాష్ట్రాల్లో స్వల్ప మెజారిటీతో బీజేపీ ఓడిపోయే స్థానాల్లో కమలాన్ని గెలిపించేందుకు అక్కడికెళుతూంటారని విమర్శించారు. ఇప్పటి వరకు ఎంఐఎం పార్టీ పోటీ చేసిన వివిధ రాష్ట్రాల నియోజకవర్గాలను పూర్తిగా పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమైందని తెలిపారు. ఈ మూడు పార్టీలు బయటికి మాత్రమే విమర్శలు చేసుకుంటూ, లోపల లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నాయని చెప్పారు. మతోన్మాద బీజేపీని ఓడించేందుకు తాము ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఆ పార్టీకి సహకరిస్తున్న బీఆర్ఎస్, ఎంఐఎంలను కూడా ఓడించేందుకు ఓట్ల చీలిక జరగకుండా ప్రజాసంఘాలు ప్రయత్నించాలని ఆయన సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా నిలబడ్డ ప్రజాస్వామిక అభ్యర్థులను, వారూ లేని చోట కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ మనుష్యుల మధ్య విద్వేషాలు పెంచుతూ, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెంచేసిందనీ, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తున్నదనీ, బ్యాంకుల నుంచి లక్షల కోట్ల రూపాయలు తీసుకుని ఎగవేసిన వారిని వదిలేసిందనీ, నల్లడబ్బు బయటికి వెలికి తీయలేదని విమర్శించారు. పొఫెసర్ కోదండరామ్ మాట్లా డుతూ పాలకులతో పాటు పాలనా విధానం కూడా మారాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీతో ప్రభుత్వ ఆదాయం తగ్గిందన్నారు. విచ్చలవిడి జరిమానాలతో ప్రజలను చితకబాదుతున్నారని తెలిపారు. అప్పులు తెచ్చినా కాళేశ్వరం పూర్తి చేయలేదనీ, దక్షిణ తెలంగాణ పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని విమర్శించారు. ప్రజా సంఘాల కార్యక్రమాలకు ఎన్నికల కోడ్ అడ్డు కాదని స్పష్టం చేశారు. 40 రోజులు ప్రజల మధ్యకు ఐక్యంగా వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వంతో జరిగిన నష్టాన్ని వివరించాలని సూచించారు.

## ఎన్నికల వేళ...
# అంతా వాళ్ల చేతుల్లోనే

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ ఐపీఎస్ అధికారుల బదిలీలు తీవ్ర చర్చనీయాంగా మారాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన మరుసటి రోజు నుంచే కేంద్ర ఎన్నికల కమిషన్ అధికార యంత్రాంగంలో ప్రక్షాళన చేపడుతోంది. సౌత్ ఆఫీసర్లకు కాకుండా నార్త్ ఆఫీసర్లకు కేంద్ర ఎన్నికల కమిషన్ పెద్ద పీట వేస్తోందన్న చర్చ జరుగుతోంది. ముఖ్యంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన కమిషనరేట్లలో నార్త్ ఆఫీసర్లను కమిషనర్లుగా నియమించింది ఎలక్షన్ కమిషన్. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు నాన్ క్యాడర్ ఐపీఎస్‌లు కొన్ని జిల్లాల ఎస్పీలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుండే తెలంగాణలో కీలక పదవుల్లో ఉన్న కీలక పదవుల్లోని పోలీసు అధికారులపై ఈసీ దృష్టి సారించింది. మొదటి దశ పోలీస్ అధికారుల బదిలీలలో చాలామంది నాన్ క్యాడర్ ఎస్పీలను ఎన్నికల విధుల నుంచి ఈసీ తప్పించింది. కీలక జిల్లాలు వరంగల్, నిజామాబాద్ లాంటి జిల్లాలలో డైరెక్ట్ ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్ ఇచ్చింది.ప్రస్తుతం హైదరాబాద్ సిటీతో పాటు చాలా జిల్లాలలో నార్త్ ఆఫీసర్‌లకే ఎలక్షన్ కమిషన్ పట్టం కట్టింది. హైదరాబాద్ సీపీ పదవి నుంచి సీవీ ఆనంద్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో నార్త్‌కి చెందిన సందీప్ శాండిల్యను నియమించారు. అలాగే వరంగల్ కమిషనర్ గా ఉన్న రంగనాథ్‌ను తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ స్థానానికి బదిలీచేశారు. ఆయన స్థానంలో బీహార్‌కు చెందిన అంబర్ కిషోర్ ఝాను వరంగల్ సీపీగా నియమించారు. నిజామాబాద్ కమిషనర్‌గా కల్మేశ్వర్, మహబూబాబాద్ ,నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల్, నారాయణపేట లాంటి జిల్లాలలో నార్త్ ఆఫీసర్లకు ఎస్పీలుగా పోస్టింగ్ ఇచ్చారు. ఇక చాలా కాలంగా హైదరాబాద్ టాస్క్ ఫోర్స్‌లో సీనియర్ లెవల్‌లో పనిచేసిన రాధా కిషన్ రావును ఆ బాధ్యతల నుంచి తప్పించి.. ఆయన స్థానంలో 2017 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన నార్త్ ఆఫీసర్ నిఖిత పంత్ కు పోస్టింగ్ ఇచ్చారు.తెలంగాణ పోలీస్ యంత్రాంగంలో కీలక పదవుల్లో ఉన్న సౌత్ ఆఫీసర్ల స్థానంలో నార్త్ ఆఫీసర్లకు పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర డిజిపి అంజనీ కుమార్‌ని మొదలుకొని హైదరాబాద్, రాచకొండ కమిషనర్లతో పాటు చాలా జిల్లాల ఎస్పీలుగా, నగరాల పోలీస్ కమిషనర్లుగా నార్త్ అధికారులు పనిచేస్తుండటం విశేషం.

## కార్తీక మాసం...
# పెళ్లిళ్ల సీజన్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




కార్తీక మాసంలో లక్షల పెళ్లిళ్లు జరగనున్నాయి. తులసి కల్యాణం తర్వాత దేశంలో పెళ్లి వేడుకలు ప్రారంభం కానున్నాయంటూ షాకింగ్ గణాంకాలు వెలువడ్డాయి. కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసిన పెళ్లిళ్లను చూస్తే మీరు కూడా ఆశ్చర్యపోతారు. దీపావళి తర్వాత అంటే కార్తీక మాసం తులసి కల్యాణం తర్వాత పెళ్లి వేడుకలు మొదలవుతాయి. పండుగల కాలంతో పాటు మరికొద్ది రోజుల్లో పెళ్లిళ్లకు సంబంధించిన కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి. రాబోవు రోజుల్లో బిజినెస్ పెరగనుండటంతో వ్యాపారులు సైతం ఇందుకోసం ప్రత్యేకంగా సన్నాహాలు మొదలుపెట్టారు. దీపావళి ముగిసిన వెంటనే ప్రారంభమయ్యే పెళ్లిళ్ల సీజన్ నుంచి భారీ లాభాలు వస్తాయని వ్యాపారులు భావిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో 23 రోజుల్లో దాదాపు 6 లక్షల పెళ్లిళ్లకు ఒక్కో పెళ్లికి రూ.3 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేయగా, దాదాపు 10 లక్షల పెళ్లిళ్లలో ఒక్కో పెళ్లికి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ తెలిపారు. ఖండేల్వాల్. దాదాపు 12 లక్షల పెళ్లిళ్లకు ఒక్కో పెళ్లికి రూ. 10 లక్షలు, 6 లక్షల పెళ్లిళ్లకు రూ. 25 లక్షలు, 50 వేల పెళ్లిళ్లకు రూ. 50 లక్షలు, 50 వేల పెళ్లిళ్లకు రూ. కోటి లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు అవుతుంది.ఈ సంవత్సరం, వివాహ వేడుకల సీజన్ నవంబర్ 23 నుండి ప్రారంభమవుతుంది. ఈ సీజన్ డిసెంబర్ 15 వరకు కొనసాగుతుంది.ఈ కాలంలో దేశవ్యాప్తంగా మొత్తం 35 లక్షల వివాహాలు జరుగుతాయని ఒక అంచనా. ఈ వివాహాల కోసం వివిధ సేవలను అందించే మార్గాలు అనేకం ఉంటాయి. ఈ వివాహ వేడుకల సీజన్‌లో దాదాపు 4.25 లక్షల కోట్ల రూపాయల టర్నోవర్ జరగనున్నట్లు తెలుస్తోంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అధ్యక్షుడు బి. సి. భారతీయ, జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ 'క్యాట్' పరిశోధన విభాగం అంటే క్యాట్ రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీని ఉటంకిస్తూ ఒక నివేదికను విడుదల చేశారు. దేశంలోని 20 ప్రధాన నగరాల్లో వ్యాపారులు, వివాహ సేవల ప్రదాతలపై ఒక సర్వే నిర్వహించబడింది. ఒక్క ఢిల్లీలోనే ఈ సీజన్‌లో దాదాపు 3.5 లక్షల పెళ్లిళ్లు జరగనున్నాయి. ఢిల్లీలోనే ఈ 23 రోజుల వ్యవధిలో దాదాపు లక్ష కోట్ల టర్నోవర్ జరగనుంది. గతేడాది ఇదే కాలంలో 32 లక్షల వివాహాలు జరగనున్నాయి. ఈసారి మొత్తం వ్యయం 3.75 లక్షల కోట్లకు చేరింది.పెళ్లి సీజన్‌లో మంచి వ్యాపార అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, దేశవ్యాప్తంగా వ్యాపారులు విస్తృతమైన సన్నాహాలు చేశారు. వినియోగదారుల అవసరాలను తీర్చడానికి వ్యాపారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకుంటున్నారు.. బాంక్వెట్ హాళ్లు, హోటళ్లు, ఓపెన్ లాన్‌లు, కమ్యూనిటీ సెంటర్లు, పబ్లిక్ పార్కులు, ఫామ్ హౌస్‌లు, వివాహాల కోసం అనేక రకాల స్థలాలు దేశవ్యాప్తంగా పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి. ప్రతి పెళ్లిలో ఉపకరణాల కొనుగోలుతో పాటు, టెంట్ డెకరేటర్‌లు, ఫ్లవర్ డెకరేషన్‌లు, క్రాకరీ, క్యాటరింగ్ సర్వీస్, ట్రావెల్ సర్వీస్, క్యాబ్ సర్వీస్, ప్రొఫెషనల్ గ్రూప్‌లు, కూరగాయల విక్రయదారులు, ఫోటోగ్రాఫర్‌లు, వీడియోగ్రాఫర్ వంటి అనేక రకాల సేవలు కూడా పాల్గొంటాయి.బ్యాండ్-బాజా, షెహనాయి, ఆర్కెస్ట్రా, డీజే, ఊరేగింపు కోసం గుర్రాలు, బండ్లు, లైట్లు, అనేక ఇతర రకాల సేవలు ఈసారి పెద్ద వ్యాపారం చేసే అవకాశం ఉంది. దీనితో పాటు ఈవెంట్ మేనేజ్‌మెంట్ కూడా పెద్ద వ్యాపార అవకాశంగా మారిందిని సర్వే నిర్వహకులు చెప్పారు.

# గులాబీ గూటికి ఉద్యమకారులు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ ఉద్యమకారుడిగా అందరికి సుపరిచితమైన డాక్టర్ చెరుకు సుధాకర్ కాంగ్రెస్ ను వీడనున్నారు. తిరిగి బీఆర్ఎస్ లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రేపోమాపో ఆయన? సొంత గూటికి చేరటం ఖాయంగానే కనిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ కారులు ఒక్కొక్కరే తిరిగి తమ ఉద్యమాలకు వేదికనిచ్చిన భారత రాష్ట్ర సమితి (అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి) గూటికి చేరుకుంటున్నారు. గడిచిన పది పదిహేనేళ్లుగా గులాబీ పార్టీకి దూరంగా ఉన్న ఈ నాయకులు ఆయా పార్టీలో తమ లక్ ను పరీక్షించుకుని విఫలమై సొంత గూడుకు చేరుతున్నారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలక్రిష్ణారెడ్డి హైదరాబాద్ తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటి మంత్రి కె.తారక రామారావు (కేటీఆర్) సమక్షంలో తన అనుయాయులతో కలిసి గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరికి చెందిన జిట్టా బాలక్రిష్ణారెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్లో చేరిపోయారు. ఇపుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గానికే చెందిన మరో సీనియర్ నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్ వంతు వచ్చింది. ఆయన కూడా రేపోమాపో గులాబీ కండువా కప్పుకోవడమే మిగిలింది.డాక్టర్ చెరుకు సుధాకర్ 2014 ఎన్నికల సమయానికి ముందే ఒక విధంగా బీఆర్ఎస్ కు దూరమయ్యారు. ఆ సమయంలో ఆయన అప్పటి టీఆర్ఎస్ పోలిట్ బ్యూరో సభ్యునిగా కూడా ఉన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో తనను కాదని, అప్పుడప్పుడే పార్టీలో చేరిన వేముల వీరేశానికి నియోజకవర్గ ఇన్ చార్జ్ బాధ్యతలు అప్పజెప్పండతో డాక్టర్ చెరుకు సుధాకర్ అలక బూనారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో కూడా టికెట్ దక్కలేదు. దీంతో పార్టీకి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమ కారుల వేదిక ఏర్పాటు చేసి పనిచేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు తెలంగాణ ఇంటి పార్టీకి పురుడు పోశారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీకి జరిగిన ఎన్నికల్లోనూ ఆయన పోటీ చేశారు. చివకు తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారు.కొన్నాళ్ళుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నా.. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఆయనకు పొసగలేదు. ఇద్దరి మధ్య వివాదం కూడా జరిగింది. అయితే, టీపీసీసీ నేత రేవంత్ రెడ్డి డాక్టర్ చెరుకు సుధాకర్ ను వెనకేసుకొచ్చినా.. ఈ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి సైతం కోమటిరెడ్డితో సయోధ్య చేసుకున్నారని చెబుతున్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకత్వం చెరుకు సుధాకర్ కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వక పోవడం, కనీస గుర్తింపు కూడా లేకపోవడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోతున్నారు. ఉదయ్ పూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతీ లోక్ సభ నియోజకవర్గంలో రెండు అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించాల్సి ఉంది. కానీ, జిల్లాలో ఇప్పటికి ఒక్క ఆలేరు మాత్రమే కేటాయించారు. మరో స్థానాన్ని కేటాయిస్తారన్న నమ్మకం కూడా లేకపోవడం, తనకు ఎక్కడా అవకాశం కూడా దక్కే సూచనలు లేకపోవడం, పార్టీలో చెప్పుకోదగిన బాధ్యతలు లేకపోవడం వంటి అంశాలపై తర్జనభర్జనల తర్వాత కాంగ్రెస్ ను వీడాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.పార్టీలో ఉన్నప్పటి నుంచి డాక్టర్ చెరుకు సుధాకర్ కు మంత్రి హరీష్ రావుతో మంచి సంబంధాలే ఉన్నాయి. తెలంగాణ ఉద్యమకారులనంతా తిరిగి పార్టీలోకి తీసుకువచ్చే బాధ్యతల్లో భాగంగా మంత్రి హరీష్ రావు, కాంగ్రెస్ లో కుదురుకోలేక పోతున్న డాక్టర్ చెరుకు సుధాకర్ ను సంప్రదించి ఒప్పించినట్లు తెలుస్తోంది. " కనీసం నా సీనియారిటీని, అనుభవాన్ని పార్టీ కోసం ఉపయోగించుకునే తెలివి కాంగ్రెస్ నాయకత్వానికి లేదు. ఇక్కడ బయట పార్టీలో ఉండి ఏం కొట్లాడగలం. అందుకు సొంత పార్టీలో ఉంటే మేలన్న అభిప్రాయానికి వచ్చిన. అక్కడ కనీస గౌరవమైనా దక్కుతుంది.

# ఓటర్ లిస్ట్ చెక్ చేసుకోండి..!



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** ఓటర్లు అప్రమత్తంగా ఉండి జాబితాలో తమ పేరును చెక్ చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. 'ఓటర్ ఐడీ కార్డు ఉన్నంత మాత్రాన మీ ఓటు ఉందని భావించవద్దు. జాబితాలో మీ పేరును రీ చెక్ చేసుకోవాలి' అని స్పష్టం చేశారు. హైకోర్టులో స్వీప్ యాక్టివిటీ కింద ఏర్పాటు చేసిన రీ చెక్ యువర్ ఓటు కౌంటర్ ను డిప్యూటీ డీఈవో అనుదీప్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు హైకోర్టు జడ్జిలు, న్యాయవాదులు, సిబ్బందితో మాట్లాడి ఓటరు జాబితాలో తమ పేరు ఎలా చెక్ చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా ఓటరు జాబితాలో మీ పేరు చెక్ చేసుకో వచ్చని తెలిపారు. ఇతర సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1950ను సంప్రదించాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు సమావేశాలు, ర్యాలీల నిర్వహణ కోసం సువిధ యాప్ ద్వారా ముందస్తు అనుమతులు తీసుకోవాలని, 24 గంటల్లోగా దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వీవీఐపీలు, వీఐపీల పర్యటన సమయంలో స్థానిక పోలీస్ అధికారులతో పాటు పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాలని, ప్రజలకు, ముఖ్య అతిథులకు ఇబ్బందులు కలుగకుండా సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. జిల్లాలో సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు. తెలంగాణ సహా మరో నాలుగు రాష్ట్రాల్లో శాసనసభ సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటర్ గుర్తింపు నిర్ధారణ విషయంలో కొత్త మార్గదర్శకాలను జారీ చేస్తూ సీఈసీ ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులకు ఇటీవల లేఖ రాసింది.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేసి ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎన్నికల అధికారి, రొనాల్డ్ రోస్ అధికారులకు సూచించారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా, మీడియాలో ఫేక్ న్యూస్ ప్రసారమైనా, ఓటర్లు ఏదైనా సందేహాల నివృత్తికి, సమాచారం కోసం సంప్రదించిన వెం టనే స్పందించాలని చెప్పారు. సి-విజిల్ ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరిం చాలన్నారు. ఎక్కడైనా మద్యం, డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే క్షేత్రస్థాయిలో ఫ్లయింగ్ అప్రమత్తం చేయాలన్నారు. ప్రతీ విభాగానికి వేర్వేరుగా రికార్డు లను నిర్వహిం చాలన్నారు. ఆయా బృందాలతో శాసనసభ నియోజకవర్గాల వారీగా విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అధికారులు ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండా లన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అధికారులు ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై స్పందించాలని, మద్యం, నగదు కానుకల పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు.

# ఊరు వెళ్తున్నారా... జరా భద్రం

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** తెలుగు రాష్ట్రాల్లో దసరా పెద్ద పండుగ. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఇక దసరా పండుగ సందర్భంగా ఉపాధి కోసం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారుకూడా వారి స్వస్థలాలకు బయలు దేరుతున్నారు. ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా స్వగ్రామాలకు వెళ్తున్నారు. అయితే ఇదే అలుసుగా భావించిన దొంగలు రెచ్చిపోతున్నారు. అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో దొంగతనాలు జరగకుండా సైబరాబాద్ పోలీసులు, రాచకొండ పోలీసులు ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు.

- మీరు బయటకు వెళ్లాల్సి వస్తే మీ విలువైన బంగారం, వెండి, నగలు, డబ్బులను బ్యాంకు లాకర్లలో ఉంచండి. లేదా మీ ఇంట్లో రహస్య ప్రదేశంలో దాచండి.
- సెలవుల్లో బయటకు వెళ్లేటప్పుడు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్‌ని అమర్చుకోవడం మంచిది.
- మీ ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్‌తో లాక్‌ని ఇన్‌స్టాల్ చేయడం మంచిది.
- తాళం వేసి గ్రామానికి వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వండి.
- మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే, వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి. లేదా 100కి డయల్ చేయండి.
- మీ ఇంటి ఆవరణలో మీ వాహనాలను పార్క్ చేయండి. మీ ద్విచక్ర వాహనాలను చక్రాలకు గొలుసులతో లాక్ చేసినట్లు నిర్ధారించుకోండి.
- నమ్మకమైన వాచ్‌మెన్‌లను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోండి.
- మీ ఇంట్లో అమర్చిన సీసీటీవీ కెమెరాలను ఆన్‌లైన్‌లో క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి.
- ఇంట్లో లేని సమయంలో చెత్త, న్యూస్ పేపర్, పాల ప్యాకెట్లు ఇంటి ముందు పేరుకుపోకూడదు. వారిని గమనించి దొంగలు కూడా చోరీలకు పాల్పడుతున్నారు.
- మెయిన్ డోర్ కు తాళం వేసినా అవి కనిపించకుండా కర్టెన్లు కప్పి ఉంచడం మంచిది.
- బయటికి వెళ్లేటప్పుడు ఇంటి లోపలా, బయటా కొన్ని లైట్లు పెట్టుకుంటే మంచిది.
- మీరు దూరంగా ఉన్నప్పుడు మీ ఇంటిపై నిఘా ఉంచమని మీ విశ్వసనీయ పొరుగువారిని అడగండి.
- మీ ఇంటి లోపల అఉఎ కెమెరాలను అమర్చండి మరియు ఆఎఖీ ను ఎవరూ చూడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో ఉంచండి.
- అల్మారాలు, కప్‌బోర్డ్‌లు మరియు కప్‌బోర్డ్‌లకు తాళాలు మీ ఇంటిలో ఒక రహస్య ప్రదేశంలో ఉంచాలి, అల్మారాలు, అల్మారాలు కింద, దుప్పట్లు , దిండ్లు కింద, సాధారణ ప్రాంతంలో షూ స్టాండ్‌లు, కప్‌బోర్డ్‌లు, డ్రెస్సింగ్ టేబుల్‌లు, కప్‌బోర్డ్‌లపై కాదు.
- ఆలయాలకు, ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు బంగారు ఆభరణాలు ధరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- మీరు బయటకు వెళ్లడాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడం మంచిది కాదు.
- కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛంద కమిటీలను ఏర్పాటు చేయాలి.
- ఎవరికైనా అనుమానం ఉంటే 100 టోల్ ఫ్రీ నంబర్‌కు, సైబరాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ 9490617100 లేదా వాట్సాప్ నంబర్ 9490617444కు డయల్ చేయండి.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215